ఉత్తమ మాతృమూర్తిగా భూదేవి

భూదేవిని సన్మానిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రామగిరి, నవంబర్ 24 : దేవరకొండకు చెందిన రిటైర్డ్ హాస్టల్ ఉద్యోగి చిలుకూరి భూదేవిని ఉత్తమ మాతృమూర్తిగా ఎంపిక చేశారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా వారికి శిక్షణ ఇచ్చేందుకు ఎక్సైజ్ సీఐ కె.ఏడుకొండలు 'మిషన్' కార్యక్రమం ప్రారంభించి 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాయంలో నిర్వహించిన ఉత్సవాల్లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ జేడీ లక్ష్మీనారాయణ, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్‌నారాయణ, కార్యక్రమ నిర్వాహకులు భూదేవిని ఘనంగా సన్మానించారు. చిల్కూరి భూదేవి భర్త దామోదర్ మరణించినప్పటికీ తాను హాస్టల్లో వంటమనిషిగా పనిచేస్తూ తన ఇద్దరు కుమారులు, కుమార్తెను ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించింది. ఆమె సేవలను గుర్తించిన సంస్థ నిర్వాహకులు సన్మానించారు.

రోడ్డు కోసం చెరువు మట్టి తరలింపు

- గ్రామస్తులు అడ్డుకున్నా..
- ఆగని అక్రమ తవ్వకాలు

అప్పాజీపేటలోని కాకి చెరువులో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

నల్లగొండ రూరల్, నవంబర్ 24 : నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలోని కాకి చెరువు మట్టిని కొందరు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామం మీదుగా కంచనపల్లి వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు కోసం చెరువు నుంచి మట్టిని తరలిస్తుండడంతో ఇటీవల గ్రామస్తులు అడ్డుకున్నారు. దాంతో ఆ ఒక్క రోజు తరలింపు నిలిపి వేసిన కాంట్రాక్టర్ ఆ తర్వాత మళ్లీ మొదలు పెట్టాడు. ప్రతి రోజు రాత్రి వేళల్లో జేసీబీతో చెరువు మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆదివారం కూడా కొందరు గ్రామస్తులు మట్టి తరలింపును అడ్డుకున్నారు. అనుమతులు లేకున్నా మట్టిని తరలిస్తున్నారని ఐబీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాకి చెరువు నుంచి అప్పాజీపేట –దోమలపల్లి రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలించి చెరువులో అన్ని గుంతలు చేశారని, ఇప్పుడు ఉన్న మట్టిని తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే చెరువు మట్టి తరలింపును నిలిపివేయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నార్కట్‌పల్లి, నవంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యా విధానం కేవలం ప్రైవేటు యాజమాన్యాలకు అనుగుణంగా ఉందని, దానిని వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలు ఆదివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని రేణుక గార్డెన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు యడ్ల సైదులు అధ్యక్షతన నిర్వహించారు. సభలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఈపీ–2020 విద్య కార్పొరేటీకరణ, కాశాయీకరణకు దారి తీసేలా ఉందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుత విద్యా వ్యవస్థలో పెద్ద ఎత్తున బదిలీలు, ప్రమోషన్లు త్వరలో చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీలు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 1, 2వ తరగతులు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు శ్రీనివాసాచారి, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు నాగమణి, భానుప్రకాశ్, రాధారపు భిక్షపతి, గోవర్దన్, కల్లూరి యాదగిరి, బయ్యన్న, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే వివరాల డేటా ఎంట్రీ పక్కాగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిప్పర్తిలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ సిటీ/తిప్పర్తి, నవంబర్ 24 : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీని పక్కాగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం కనగల్, తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయాల్లో చేపడుతున్న డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంట్రీలో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓలు జయరామ్, వెంకటేశ్వర్‌రెడ్డి, తిప్పర్తి తాసీల్దార్ స్వప్న, ఎంపీఓ సుమలత ఉన్నారు.

26న హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

కట్టంగూర్, నవంబర్ 24 : మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న హ్యాండ్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయ పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి ఈ నెల 29న నుంచి డిసెంబర్ 1 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ సోషల్ మీడియా కన్వీనర్‌గా విజయ్‌కుమార్

రామగిరి, నవంబర్ 24 : పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా నల్లగొండకు చెందిన చొక్కారపు విజయ్‌కుమార్‌ను నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

ప్రజలకిచ్చిన హామీలు మర్చి విజయోత్సవాలా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

కేతేపల్లి, నవంబర్ 24: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, హామీల అమలు వదిలేసి విజయోత్సవాలు నిర్వహిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మండల కేంద్రంలో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి పేరున నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల హామీలు వదిలేసి రోజుకో ఘటనతో ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టిస్తుందన్నారు. హైడ్రా పేరుతో పేదప్రజలను ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. నిధులను దారి మళ్లించేందుకే మూసీ ప్రక్షాళన చేపట్టిందని విమర్శించారు. వందలాది కంపెనీల నుంచి వచ్చి మూసీలో కలిసే వ్యర్థాలను నివారించకుండా మూసీ శుద్ధీకరణ ఎలా సాధ్యమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో లగచర్లలో ఫార్మాసిటీ ఏర్పాటును నిరసిస్తూ గిరిజనుల తిరుగుబాటుకు తాము అండగా ఉంటామని, ఇది ప్రభుత్వ తప్పిదమే అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, కె.ప్రమీల, బోళ్ల నర్సింహారెడ్డి, బొజ్జ చినవెంకులు, సీహెచ్.లూర్ధుమారయ్య, ఏళ్ల అశోక్ రెడ్డి, ఎల్.రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

అన్నదానం చేస్తున్న ఎన్‌సీసీ అధికారి సుధాకర్, క్యాడేట్లు

రామగిరి, నవంబర్ 24:ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కళాశాల ఎన్‌సీసీ విభాగం అధికారి చిలుముల సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాడేట్లు హిమాలయ వృద్ధాశ్రమం, లతీఫ్‌సాబ్ గుట్ట వద్ద, రోడ్లపై ఉన్న నిరుపేద వృద్ధులకు అన్నదానం చేశారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో గౌరవ వందం స్వీకరించారు. ఎన్‌సీసీ అధికారులకు, విద్యార్థులకు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులు విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- తాసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ విజయకుమారి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురారం, నవంబర్ 24: విద్యార్థినులు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తాసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీఓ కూన్‌రెడ్డి విజయకుమారి సూచించారు. ఆదివారం మండలంలోని కంపసాగర్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను వారు తనిఖీ చేశారు. హాస్టల్ స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సిబ్బంది విద్యార్థినుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ ఆవరణలో నిర్మిస్తున్న వాటర్ సంప్‌ను పరిశీలించి నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. వారి ఎంఈఓ రవినాయక్, ఎస్ఓ విజయలక్ష్మి, దీప ఉన్నారు.

ఖోఖో బాలికల జట్టు కెప్టెన్‌గా వైశాలి

దామరచర్ల, నవంబర్ 24 : రాష్ట్ర జూనియర్ ఖోఖో బాలికల జట్టు కెప్టెన్‌గా దామరచర్లకు చెందిన నూకల వైశాలిని ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వైశాలి ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన కోచింగ్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చడంతో ఆమెను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ నెల 25 నుంచి 28 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో వైశాలి రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుంది.

శాతవాహన యూనివర్సిటీ డీన్‌గా ఆకుల రవి

రామగిరి, నవంబర్ 24: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల కామర్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆకుల రవి కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ విభాగం డీన్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ ఆదేశాలమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆకుల రవి ఎంజీయూలో వివిధ హోదాల్లో పనిచేశారు. అతి చిన్న వయస్సులోనే ప్రొఫెసర్ అయిన ఆయన సేవలను గుర్తించిన శాతవాహన యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్‌గా నియమించడంపై ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అభినందనలు తెలిపారు. ఆకుల రవి ఎంజీయూలో రెగ్యులర్‌గా సేవలందిస్తునే శాతవాహన యూనివర్సిటీలో అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ రూరల్, నవంబర్ 24 : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం జరుగనున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారయణ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలకు బడ్జెట్‌లో రూ.75,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 23న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంగూరు నారాయణ, బత్తుల శ్రీనివాస్, రామదాసు, మునాసు ప్రసన్న, గుండు వెంకటేశ్వర్లు, భరద్వాజ్, కీర్తి శ్రీనివాస్, తిరుపతయ్య, శంకరయ్య, చంద్రయ్య, దశరథ, మోహన్ పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న కాపురాలగుట్టను పరిరక్షించాలి

- ఐక్యరాజ్య సమితి యునెస్కో సభ్యుడు వెంకటరమణారావు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారావు

రామగిరి, నవంబర్ 24: నల్లగొండ చరిత్రకు తార్కాణంగా ఉన్న కాపురాలగుట్ట ప్రస్తుతం అన్యాక్రాంతమవుతుందని, దానికి పరిరక్షించి భవిష్యత్ తరాలకు చరిత్రను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐక్యరాజ్య సమితి యునెస్కో సభ్యుడు ఆదోని వెంకటరమణారావు అన్నారు. ఆదివారం పాతబస్తీ ఆర్యసమాజంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపురాలగుట్టపై కాకతీయులు, పద్మానాయకుల కాలం నాటి శివాలయం, అమ్మవారి, వినాయక గుడి ఉన్నాయని, ప్రస్తుతం ఇవి ధూప, దీప నైవేద్యాలకు నోచక మరుగున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలోని చాల భాగం అన్యాక్రాంతమైందని దీనిని పరిరక్షించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని 2017లో కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసినట్లు చెప్పారు. 2018లో కేంద్ర ప్రభుత్వం గుట్ట ప్రాంతాన్ని పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందన్నారు. దాంలో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ ద్వారా నల్లగొండ ఎమ్మెల్యేగా ఉన్న కంచర్ల భూపాల్‌రెడ్డికి తెలిమన్నారు. భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి గుట్టపై అన్ని ప్రాంతాలను పరిశీలించి గుట్ట అభివృద్ధికి డీపీఆర్ రూపొందించారని తెలిపారు. గుట్టను 'ఎకో టూరిజం' స్పాట్‌గా అభివృద్ధి చేసే విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా 2021లో కేంద్ర ప్రభుత్వానికి నివేదించామన్నారు. స్వదేశీ దర్శ నం స్కీం కింద కాపురాలగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్య సమాజ్ నిర్వాహకులు చింత హరిప్రసాద్, ఒగ్గు గణేశ్, న్యాయవాది రాములు ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్‌ఈ పరీక్ష

రామగిరి, నవంబర్ 24: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్‌ఈ) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. నల్లగొండలో 3, దేవరకొండలో3, మిర్యాలగూడలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,424 మంది హాజరుకావాల్సి ఉండగా 1,331 మంది హాజరైనట్లు డీఈఓ భిక్షపతి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్‌షరీప్ వెల్లడించారు.

ఘనంగా కార్తిక మాస వనభోజనాలు

కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

చండూరు, నవంబర్ 24: చండూరు పట్టణ, మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నార్కట్‌పల్లి మండలం అక్కినేపల్లి గ్రామ శివారులోని వేంకటేశ్వరాలయం వద్ద కార్తిక మాస వన భోజనాలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. కార్తిక వనమహోత్సవ సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు తడకమళ్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి వెంకన్న, పట్టణాధ్యక్షుడు తాడిశెట్టి సంతోశ్, కార్యదర్శి వాసరాంబాబు, వాసవి మాత ఆలయ అధ్యక్షుడు తేలుకుంట్ల జానయ్య,

కౌన్సిలర్ మంచుకొండ కీర్తిసంజయ్, సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ రూరల్, నవంబర్ 24 : మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఒంటెద్దు రవీందర్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం గ్రామానికి వెళ్లి వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గెంపూడి నారాయణరెడ్డి, నాయకులు చౌగాని భిక్షం గౌడ్, నరేందర్‌రెడ్డి, వెంకన్న, రవి, శ్రీనివాస్, రమణ, నగేశ్, అంజయ్య పాల్గొన్నారు.

దామరచర్ల : మండలంలోని రాళ్లవాగుతండాకు చెందిన భూక్యా మదారి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తండాకు వెళ్లి మదారి మృతదేహాన్ని సందర్శించి నివాళలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అర్వపల్లి వద్ద కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతాం

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్

శాలిగౌరారం, నవంబర్ 24 : బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మహబూబాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా మార్గ మధ్యంలో అర్వపల్లి వద్ద ఆయనకు ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు అన్ని గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

మిర్యాలగూడ, నవంబర్ 24: సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్రం ప్రభుత్వం బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నో ఏండ్లుగా బీసీలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెజార్టీగా ఉన్న బీసీల మనోభావాలను గౌరవించాలని, బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చెర్వుగట్టులో భక్తుల రద్దీ

చెర్వుగట్టు ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

నార్కట్‌పల్లి, నవంబర్ 24 : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలు చేశారు. దాంతో పాటు గోపలాయపల్లి గుట్టపై ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో కూడా భక్తుల రద్దీ నెలకొంది. హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు గుట్టపై కార్తీక భోజనాలు చేశారు.

రోడ్డు దిగితే ఆస్పత్రి పాలే..

కోతకు గురైన ఈదులూరు రోడ్డు

కోతకు గురైన ఈదులూరు రహదారి

కట్టంగూర్, నవంబర్ 24 : కట్టంగూర్ నుంచి ఈదులూరు–కల్మెర గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. మార్గమధ్యంలో పలు చోట్ల రోడ్డు ధ్వంసమైంది. మరికొన్ని చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దాంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో మూలమలుపు వద్ద రోడ్డు అంచు భాగం పూర్తిగా కోతకు గురైంది. దాంతో రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణంచాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఒకే సారి వచ్చినప్పుడు ఒక వైపు రోడ్డు దిగే క్రమంలో బైక్ నడిపే వారు కింద పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం

యజ్ఞంలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

చందంపేట, నవంబర్ 24 : కార్తిక మాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ మాలధారులు గాయత్రి మహయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గాదె కిశోర్‌శర్మ, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, నేతాల వెంకటేశ్, శేఖర్‌గౌడ్, రాజలింగం, అమరేందర్‌రెడ్డి, పర్వతాలు, శంకర్‌నాయక్, పగిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పలువురి పరామర్శ

శాలిగౌరారం, నవంబర్ 24 : మండలంలోని గురజాల గ్రామ మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ తండ్రి గుండా కిష్టయ్య(96) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్ గ్రామానికి వెళ్లి కిష్టయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చండూరు, నవంబర్ 24: మండలంలోని బోడంగిపర్తి గ్రామానికి చెందిన తోటకూరి అంజయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.35వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఎండీ. సుజాఉద్దిన్ ఆదివారం అందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వరికుప్పల ఇద్దయ్య, నాయకులు పాల్గొన్నారు.

మాదిగ సంఘాల మహా కూటమి అధ్యక్షుడిగా శ్రీను

నిడమనూరు, నవంబర్ 24 : మాదిగ సంఘాల మహా కూటమి నిడమనూరు మండల అధ్యక్షుడిగా ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లి శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఆయనకు శనివారం నియామక పత్రం అందించారు.

జమిలీ ఎన్నికలను తిప్పి కొట్టాలి : డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్

చిట్యాల, నవంబర్ 24 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జమిలీ ఎన్నికలు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందని దీనిని తిప్పికొట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం చిట్యాలలో జరిగిని సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకే ఎన్నికతో ఖర్చులు తగ్గిస్తామని చెబుతున్న బీజేపీ, ప్రభుత్వ ఖర్చుల తగ్గింపునకు ఎన్నో మార్గాలు ఉన్నాయని వాటిని పరిశీలించాలని సూచించాడు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, నాయకులు వడ్డగాని మహేశ్, మహ్మద్ అక్రం, జిట్ట రమేశ్, కట్ట లింగస్వామి, పి.నరేశ్, అవిశెట్టి కిరణ్ పాల్గొన్నారు.

ఇష్టకామేశ్వరి ఆలయంలో పూజలు

పెద్దవూర, నవంబర్ 24 : కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని బట్టుగూడెం గ్రామంలో గల శివాలయంలో ఆదివారం ఇష్టకామేశ్వరస్వామిని వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ప్రధానార్చకుడు సూరిపట్ల అనంతశర్మ, అర్చకుడు రాజుశర్మ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మునుగోడు : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మునుగోడు, నవంబర్ 24 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, నళిని, రంజన్‌రావు, లింగారెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ఎంఈఓ కత్తుల రవీందర్, పూర్వవిద్యార్థులు కూరెళ్ల జ్ఞానేశ్వర్, పెరమాళ్ల ప్రమోద్‌కుమార్, ముచ్చపోతుల రవి, ఈద ప్రవీణ్, జీడిమెట్ల రవీందర్, కోడి అర్జున్, ముచ్చపోతుల శ్రావణ్, వెంకటేశ్వర్లు, మురహరి, యాదయ్య, శాంతి, అలివేలు, హంసమ్మ పాల్గొన్నారు.

50 ఏండ్ల తర్వాత

పాల్గొన్న మిర్యాలగూడ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ, నవంబర్ 24 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1973–75 బ్యాచ్ ఎంపీసీ, బైపీసీ పూర్వ పూర్వ విద్యార్థులు ఆదివారం 50 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్న స్నేహితులంతా వాట్సాప్ గ్రూప్ ద్వారా ఏకమై కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎడ్ల కన్నయ్య, జొన్నలగడ్డ లక్ష్మారెడ్డి, డి.మోహన్, కె.హేమ సుందర్‌గుప్తా, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కేతేపల్లి, నవంబర్ 24 : అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పుల మల్లయ్య (45) తనకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వానకాలం పంట సాగుకు, కూతురు వివాహం కోసం, కుటుంబ అవసరాల కోసం తెలిసి వారి వద్ద అప్పులు చేసాడు. అయతే ఆశించిన దిగుబడులు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లయ్య శనివారం తన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.